సాక్షి తిరుపతి

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



పోలీస్ అదనపు బలగాల ఏర్పాటు
డెప్యూటీ మేయర్ ఎన్నికకు పోలీసు అదనపు బలగాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్, జేసీ తెలిపారు. - 8లో



తుమ్మలగుంటలో..
రథసప్తమికి తుమ్మలగుంట సిద్ధమైంది. విద్యుత్ దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా వెలుగొందుతోంది. - 8లో



స్వచ్ఛతా వారోత్సవాలు
పాకాల మండలంలోని గాదంకిలో సోమవారం స్వచ్ఛతా పక్వాడా వారోత్సవాలు ఘనంగా చేపట్టారు. - 8లో


బస్సులో నుంచి మేయర్ శిరీషాను కిందకు దిగకుండా అడ్డుకుంటున్న కూటమి నేతలు


బస్సులో నుంచి కారుల్లోకి ఎక్కుతున్న కార్పొరేటర్లు


కూటమి నేతల అరాచకాలతో భయాందోళనకు గురవుతున్న కార్పొరేటర్లు


కార్పొరేటర్ల బస్సు అద్దాలు ధ్వంసం చేస్తున్న కూటమి గూండాలు


పోలీసులతో వాగ్వాదానికి దిగిన కార్పొరేటర్లు, నేతలు


ధ్వంసమైన కెమెరాను చూపుతున్న ఫొటో గ్రాఫర్


ఫోన్లు లాక్కుంటున్న టీడీపీ రౌడీలు


భూమన అభినయ్‌ని అడ్డుకుంటున్న పోలీసులు

తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి గూండాలు రెచ్చిపోయారు. బలం లేని చోట బలగాన్ని వెంటబెట్టుకుని అరాచకానికి ఒడిగట్టారు. ఓటేయడానికి బస్సులో వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. మహిళా కార్పొరేటర్లపై అమానవీయంగా వ్యవహరించారు. కొందరు కార్పొరేటర్లను బలవంతంగా లాక్కొచ్చి కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. జర్నలిస్టులపైనా దాడికి తెగబడ్డారు. పోలీసులు, అధికారుల సమక్షంలోనే ఎస్వీయూ ప్రాంగణంలో రణరంగం సృష్టించారు. తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడేలా చేశారు.


వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సును చుట్టుముట్టిన కూటమి గూండాలు

గూండా రాజ్యం!

- రణరంగంగా తిరుపతి నగర డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక
- విధ్వంసం సృష్టించిన కూటమి నేతలు
- డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక నేటికి వాయిదా
- దాడులకు తలొగ్గని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- ఎస్వీయూలో కూటమి రౌడీల హల్‌చల్
- అధికార పార్టీకి సహకరించిన పోలీసులు, అధికారులు

తిరుపతి తుడా, తిరుపతి సిటీ: తిరుపతి నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక రణరంగంగా మారింది. బెదిరింపులు, దాడులు, కిడ్నాప్‌ల మధ్య కోరం లేక మంగళవారానికి వాయిదా పడింది. ఎస్వీ యూనివర్సిటీ వేదికగా సోమవారం నగర డెప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేపట్టారు. అయితే ఎస్వీయూ ప్రాంగణంలో కూటమి నేతల అరాచకాలతో హైడ్రామా నడిచింది. ఎన్నికల అధికారులు విధించిన నిబంధనలు కూటమి నేతలకు వర్తించ లేదు. వర్సిటీ ప్రాంగణం టీడీపీ, జనసేన నేతలతో నిండిపోయింది. వైఎస్సార్‌సీపీ నేతలకు అడుగడుగునా తనిఖీలు తప్పలేదు. ఉదయం 6 గంటల నుంచే యూనివర్సిటీ పోలీసుల చక్రబంధంలోకి వెళ్లింది.

కూటమి దౌర్జన్య కాండ

డెప్యూటీ మేయర్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన మెజార్టీ ఉంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటి నుంచి ఉదయం 9.55 గంటలకు బయలు దేరారు. ప్రత్యేక వాహనంలో వస్తున్న కార్పొరేటర్లు ఎస్వీయూ రెండో గేటు వద్దకు చేరుకోగానే కూటమి నేతలు అడ్డుకున్నారు. అక్కడే ముందుగా తిష్టవేసిన 300పైగా రౌడీమూకలు ఒక్కసారిగా చుట్టుముట్టారు. బస్సు చక్రాలకు గాలితీశారు. వాహన అద్దాలను ధ్వంసం చేశారు. దాడులతో ఉలిక్కిపడ్డ మహిళా కార్పొరేటర్లు భయాందోళనకు గురయ్యారు. రౌడీ మూకల అరుపులు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. వాహనంలోకి చొరబడి కార్పొరేటర్లపై పిడిగుద్దులు గుద్దుతూ తిట్ల దండకం అందుకున్నారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, బోకం అనిల్, అనీష్‌రాయల్, మోహన్ క్రిష్ణయాదవ్‌పై దాడులకు దిగారు. ఆపై సిద్ధంగా ఉన్న కూటమి నేతల వాహనాల్లో వారిని ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. మిగిలిన కార్పొరేటర్లలో ఐదుగురిని కొట్టుకుంటూ వాహనాల్లో ఎక్కించారు. మహిళా కార్పొరేటర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు.

అంతా పోలీసుల సమక్షంలోనే

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు వస్తున్న వాహనంపై విధ్వంసం, దాడులు, కిడ్నాప్‌లు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. టీడీపీ, జనసేన నేతలు గుమిగూడి, నానా హంగామా చేస్తున్నా పట్టించుకోలేదు. పోలీసుల సమక్షంలోనే కార్పొరేటర్ల కిడ్నాప్‌లు చేసినా చూసీచూనట్టు వదిలేశారు.

ఎన్నిక నిర్వహణలో విఫలం

కార్పొరేషన్ ఎన్నికల్లో ఒకే ఒక్క డివిజన్‌ను టీడీపీ గెలుచుకుంది. 48 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. ఒక్క కార్పొరేటర్‌తో కూటమి ప్రభుత్వం డెప్యూటీ మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని చేస్తున్న కుయుక్తుల పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డెప్యూటీ మేయర్ ఎన్నికను సకాలంలో నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

వర్సిటీలో రౌడీల హల్‌చల్

పోలీసులు ఎస్వీయూ ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. 144 సెక్షన్ విధించారు. పాస్‌లు పేరుతో హడావుడి సృష్టించారు. అయితే ఇవన్నీ ప్రతిపక్ష పార్టీకి మాత్రమే పోలీసులు వర్తింపజేశారు. టీడీపీ, జనసేన నాయకులు వందలాది మంది ఎన్నిక జరిగే భవనం ముందు తిష్టవేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్ తన అనుచరులతో వర్సిటీ ప్రాంగణంలో హల్‌చల్ చేశారు. టీడీపీ, జనసేన నేతలకు ఎన్నికల అధికారులు విచ్చల విడిగా పాస్‌లు ఇచ్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ నాయకుడు నరసింహయాదవ్ పోలీసులను బెదిరిస్తూ కౌన్సిల్ హాల్‌లోకి వెళ్లడం గమనార్హం.


కార్పొరేటర్ సోదరుడ్ని తీసుకెళ్తున్న అభినయ్

బలవంతంగా వీడియోలు విడుదల

కిడ్నాప్‌కు గురైన కార్పొరేటర్లపై దౌర్జన్యం చేసి వారి నుంచి బలవంతంగా వీడియోలను చేయించి విడుదల చేయించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ రాజమ్మను స్పష్టంగా కిడ్నాప్ చేసిన దృశ్యాలు ఉన్నాయి. కానీ అన్నా అనిత కిడ్నాప్ కాలేదని వీడియో చేసి మీడియాకు విడుదల చేశారు. అలానే యూనివర్సిటీ వద్ద ఐదుగురు కార్పొరేటర్లను కిడ్నాప్‌చేసి ఒకరిని విడుదల చేశారు. నలుగురు కార్పొరేటర్లను ఫామ్ హౌజ్‌లో పెట్టి తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, ఇళ్లవద్దే ఉన్నామని వీడియోలు చేయించి విడుదల చేశారు. ఈ వీడియోలు బలవంతంగా చేశారనే విషయం తేటతెల్లమవుతోంది. ఈ కుట్ర వెనుక అన్నా రామచంద్రయ్య హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రలోభాలకు తలొగ్గని కార్పొరేటర్లు

డెప్యూటీ మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు ఏకంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ రంగంలోకి దిగారు. గడిచిన ఐదు రోజులుగా తిరుపతిలో తిష్టవేసి రాజకీయాలు నడిపించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లను లొంగదీసుకునేందుకు బెదిరింపులకు దిగారు. లొంగకపోవడంతో ఆస్తుల ధ్వంసానికి తెగబడ్డారు. ఈ క్రమంలో ముగ్గురు కార్పొరేటర్లు కూటమి పంచన చేరాల్సి వచ్చింది. అయితే మిగిలిన కార్పొరేటర్లు టీడీపీ, జనసేన నేతల ఒత్తిళ్లు, దాడులకు తలవంచ లేదు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ బలాన్ని తగ్గించేందుకు కిడ్నాప్‌లకు తెరలేపారు. ఉదయం 8 నుంచి 21వ డివిజన్ కార్పొరేటర్ రాజమ్మ ఇంటి వద్ద టీడీపీ నాయకులు దిష్ట వేశారు. అన్నా రామచంద్రయ్య, కార్పొరేటర్ అనిత, టీడీపీ నేతలు కోడూరు బాల సుబ్రమణ్యం, బుల్లెట్ రమణ ఆమెను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయా రు. ఆపై ఆమె తిరిగి వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. అలాగే మరింత మంది కార్పొరేటర్ల ఇళ్లకు వెళ్లి దౌర్జన్యాలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మెజారిటీ కార్పొరేటర్లు కౌన్సిల్‌లోకి వెళ్లేందుకు నిరాకరించి నిరసనకు దిగారు.


వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కారులో కిడ్నాప్ చేస్తున్న కూటమి నేతలు


కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న కూటమి రౌడీలు


ఎస్వీయూలో అరాచకం చేస్తున్న అన్నా రామచంద్రయ్య, కూటమి గూండాలు


ఎస్వీయూ గేటు వద్ద హల్‌చల్ చేస్తున్న టీడీపీ నాయకుడు జేబీ శ్రీనివాసులు


బస్సులో నుంచి బలవంతంగా కార్పొరేటర్లను కారులోకి ఎక్కిస్తున్న కూటమి నేతలు


తన నివాసంలో కార్పొరేటర్లు, నేతలతో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి


ఎస్వీయూకు వస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, మేయర్, కార్పొరేటర్లు


కార్పొరేటర్లను కారులోకి ఈడ్చుకెళ్తున్న కూటమి నేతలు


భూమన నివాసం నుంచి బయల్దేరుతున్న కార్పొరేటర్లు


బస్సు దిగి ఎస్వీయూ సెనేట్ హాలుకు వెళ్తున్న ఎంపీ గురుమూర్తి

చట్టపరంగా ముందుకు వెళతాం



తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో చోటుచేసుకున్న దౌర్జన్యాలు, దాడులు, కిడ్నాప్ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయబోతున్నాం. ఇప్పటికే మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాం. అలాగే టీడీపీ, జనసేన నేతలు సృష్టించిన అరాచకంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

– డాక్టర్ మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

ప్రజాస్వామ్యం అపహాస్యం



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి ఉంచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. తిరుపతి కార్పొరేషన్‌లో గతంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేయడం దుర్మార్గం. సాధారణ ఎన్నికల్లో ప్రజాస్వామ్య బద్ధంగా గెలవలేదనిపిస్తోంది.

కే.నారాయణస్వామి, మాజీ డెప్యూటీ సీఎం

ప్రజాస్వామ్యం ఖూనీ



తిరుపతిలో కూటమి పార్టీల అరాచకాలతో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష నగరపాలక ప్రత్యేక సమావేశాలకు వెళ్లలేని దుస్థితి ఎదురైంది. తిరుపతిలో కూటమి పార్టీల అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నా.

– ఆర్కే రోజా, మాజీ మంత్రి

మహిళలంటే గౌరవం లేదా?



మహిళల పట్ల అధికార పార్టీ నేతలకు గౌరవం లేదు. మహిళా కార్పొరేటర్ల పట్ల టీడీపీ, జనసేన నేతలు అగౌరవంగా వ్యవహరించారు. మంచి మర్యాదలను విడిచి రాజకీయాలను చేస్తున్నారు. బలం లేకుండానే గెలవాలని చూడడం అప్రజాస్వామికం. ఇది మంచిది కాదు.

– డాక్టర్ శిరీష, తిరుపతి కార్పొరేషన్ మేయర్

ప్రజలు గమనిస్తున్నారు



తిరుపతిలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. కార్పొరేటర్ల ఆస్తులను ధ్వంసం చేయడం అమానుషం. ప్రలోభాలకు లొంగని వారిపై దాడులకు దిగుతున్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

– డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

కూటమి అరాచకాలు



తిరుపతిలో ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యంలో మంచిదికాదు. ఈ చర్యలను ఖండిస్తున్నా. కూటమి నేతల దుశ్చర్యలను ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు.

– నూకతోటి రాజేష్, సత్యవేదు సమన్వయకర్త

10న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, వైద్యాధికారులు

తిరుపతి అర్బన్: నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఈ నెల 10న చేపట్టనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తోపాటు వైద్యాధికారులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత తగ్గించి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రతి ఏటా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఈ నెల 17న మాప్–అప్ డే నిర్వహణ ఉంటుందన్నారు. 1–19 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలకు అల్బెండోజోల్ 400 ఎంజీ ట్యాబ్లెట్లు అందిస్తారని చెప్పారు. డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, డాక్టర్లు హరిత, పద్మావతి, అభిజ్ఞ, గుణశేఖర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

తిరుపతి అర్బన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బుధవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని.. ఆ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనరల్ విద్యార్థులు 24,927 మందికి 124 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 2,355 మంది కోసం 23 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. విద్యార్థులు 20 నిమిషాలకు ముందే సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని, సెంటర్లలో తప్పకుండా సీసీ కెమెరాలు ఉండాలని డీఆర్వో నరసింహులు, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ కేవీఎస్ కుమార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ రఘుపతి, రాజశేఖర్‌రెడ్డి, గోపాలరెడ్డి, రవి, విద్యుత్ శాఖ ఈఈ వాసవీలత, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చంద్రగిరి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలోని హ్యాపీ దాబా వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్న సమయంలో చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యక్తి తలపై వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు మృతదేహానికి పంచనామా పూర్తి చేసి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


గంజాయిని, ముద్దాయిలను చూపుతున్న సీఐ సుదర్శన్‌ప్రసాద్, పోలీసులు

పాకాల: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసినట్టు సీఐ సుదర్శన్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆవివరాలను విలేకరులకు వివరించారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు వచ్చిన సమాచారం మేరకు నెల్లూరు రూరల్ మండలం, మేకలవారితోటకు చెందిన సాన విష్ణుమోహన్‌రెడ్డి(24), తమిళనాడు రాష్ట్రం, తేని జిల్లా, ఉత్తమపాళెం తాలూకా, కంభం గ్రామానికి చెందిన పాండియన్(31)ని పాకాల రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 13 కిలోల గంజాయిని, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముద్దాయిలు ఇద్దరూ విజయవాడ నుంచి మదురైకి గంజాయిని తరలించడానికి పాకాల రైల్వే స్టేషన్‌కి చేరుకున్నట్టు వెల్లడించారు. అదే రోజు మదురైకి రైలు లేకపోవడంతో కాట్పాడికి వెళ్లి అక్కడి నుంచి మదురైకి వెళ్లడానికి నిశ్చయించుకున్నారని తెలిపారు. పక్కా సమాచారంతో సీఐ, ఎస్ఐ సంజీవరాయుడు, తహసీల్దార్ సంతోష్‌సాయిలు రెల్వే స్టేషన్‌కి చేరుకుని ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,706 మంది స్వామివారిని దర్శించుకోగా 23,340 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పొంచి ఉన్న నీటి గండం!

- స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్
- ఎడారిగా మారనున్న వేల ఎకరాల పంట భూములు
- సాగునీటి పథకాలకూ ఇబ్బందే
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- లబోదిబో మంటున్న అన్నదాతలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఇసుక రీచ్‌లు రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు

పెళ్లకూరు: చుట్టూ పచ్చని పంట పొలాలు. పోరుగాలికి ఆటూ ఇటూ తలూపుతూ రైతును ఉల్లాసపరిచే వరి పైర్లు. నోరూరించే కూరగాయల తోటలు. సాగుకు అనుకూలంగా వేలాది ఎకరాలు.. కానీ ఇవేవీ కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదు. స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు అనుమతిలిస్తూ ఆదేశాలివ్వడం విమర్శలకు తావిస్తోంది. నదీ పరివాహక భూములన్నీ ఎడారిని తలపిస్తాయని రైతులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.

నాటి నుంచీ!

1987లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు తెలుగుగంగా కాలువ ఏర్పాటు చేసి స్వర్ణముఖి నదికి గంగ జలాలను విడుదల చేయించారు. దాంతో మండలంలోని ముమ్మారెడ్డిగుంట, పుల్లూరు, కలవకూరు, చింతపూడి, అనకవోలు, పెరుమాళ్లపల్లి, యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ, భీమవరం, రావులపాడు, కొత్తూరు, పెళ్లకూరు, కప్పగుంటకండ్రిగ, చిల్లకూరు, జీలపాటూరు, చావలి, చెంబడిపాళెం, పాలచ్చూరు, తాళ్వాయిపాడు గ్రామాల్లోని సుమారు 1,150 మందికి పైగా రైతులు 6,352 ఎకరాల్లో వరి, వేరుశనగ, పలు రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. అలాగే స్వర్ణముఖినది నుంచి చెంబడిపాళెం గ్రామం వద్ద రాజీవ్ టెక్నాలజీ మంచినీటి పథకం ద్వారా దిగువచావలి, చెంబడిపాళె, బంగారంపేట, ఊడిపూడి, మోదుగులపాళెం, రోసనూరు, రాజుపాళెం, సిద్దాపురం వేణుంబాక గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. అలాగే తాళ్వాయిపాడు, ఎగువచావలి, శిరసనంబేడు, చిల్లకూరు, జీలపాటూరు, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు, నెలబల్లి, చింతపూడి, పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, అనకవోలు గ్రామాల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌లకు స్వర్ణముఖినది నుంచి తాగునీరు అందుతోంది.

వరి పైర్లు ధ్వంసం


స్వర్ణముఖినది తీరంలో సాగు చేస్తున్న పంటలు

కలవకూరు వద్ద ఇసుక రీచ్ కోసం ఇటీవల సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి స్వర్ణముఖి నదిని పరిశీలించారు. ఆమె ఆదేశాల మేరకు నదీ తీరంలోని ప్రభుత్వ భూముల్లో పేదలు సాగు చేసుకుంటున్న వరి పైర్లను యంత్రాలతో ధ్వంసం చేసి ఇసుక రీచ్‌కు రహదారి ఏర్పాటు చేశారు.


స్వర్ణముఖి నది నుంచి ట్రాక్టర్లతో ఇసుక తరలింపులు (ఇన్‌సెట్) స్వర్ణముఖిలో వ్యవసాయ బోర్లు, రాజీవ్ టెక్నాలజీ మంచినీటి పథకం

పొంచి ఉన్న ముప్పు

స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ మంజూరు చేయడం వల్ల పచ్చని పంట పొలాలకు ముప్పు పొంచి ఉంది. ఇసుక తోడేస్తే ఈ ప్రాంతమంతా ఎడారిగా మారే ప్రమాదం ఉంది. నదికిరువైపులా సారవంతమైన భూములు ఉండడంతో 1967లో అప్పటి పాలకులు కలవకూరు వద్ద స్వర్ణముఖినదిపై చెక్‌డ్యామ్ నిర్మించారు. పాలచ్చూరు సప్లయ్ చానల్‌కు సాగునీరు సరఫరా చేస్తున్నారు. తద్వారా పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండలాల్లోని సుమారు 37 చెరువులకు సాగునీరు అందుతోంది. ఈ క్రమంలో ఈ ప్రాంత రైతులు వంగ, బెండ, కాకర, చిక్కుడు, బీర తదితర కూరగాయలతో పాటు అనేక రకాల ఆకు కూరలు సాగుచేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇసుకరీచ్‌లు రద్దు

2019–24లో జగన్ ప్రభుత్వం కలవకూరు, కప్పగుంటకండ్రిగ, తాళ్వాయిపాడు గ్రామాల్లో మంజూరు చేసిన ఇసుక రీచ్‌లను అప్పటి అధికార పార్టీ నేతలే ఇక్కడి పరిస్థితులను హైకోర్టుకు విన్నవించారు. దాంతో రైతులు, ప్రజల సౌకర్యార్థం కోసం ఆ ఇసుక రీచ్‌లను అప్పటి జగన్ ప్రభుత్వం రద్దు చేశారు. కానీ ప్రస్తుత కూటమి నేతలు పోలీసుల కనుసన్నల్లో ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. రైతులు, ప్రజల సంక్షేమం పట్టని నేతల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుకరీచ్ రద్దు చేయాలి



స్వర్ణముఖినదిలో మంజూరు చేసిన ఇసుక రీచ్‌ను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కూటమి నేతలు ట్రాక్టర్లతో ఇసుక తోడేయడం వల్ల వ్యవసాయ బోర్ల వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. భూగర్భ జలాలు అందడం లేదు.

– చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, పుల్లూరు

నీటి గండం తప్పదు



స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ మంజూరు చేయడం వల్ల సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయి. దశాబ్దాలుగా వ్యవసాయాన్ని నమ్ముకొని బతికే రైతులకు సాగురు ప్రశ్నార్థకమవుతుంది.

– కుమారస్వామి, పునబాక

కలెక్టర చర్యలు తీసుకోవాలి



వేల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీటికి కేంద్ర బిందువుగా ఉన్న స్వర్ణముఖి నదిలో ఇసురీచ్ విషయమై కలెక్టర్ పూర్తి స్థాయిలో పరిశీలించి రద్దు చేయాలి. గత ప్రభుత్వంలో విడుదలైన కోర్టు ఉత్తర్వులను కొనసాగించేలా చర్యలు చేపట్టాలి.

– వెంకటేశ్వర్లు, చెంబేడు

కూటమి రణరంగం

తిరుపతి గాంధీరోడ్డు: తిరుపతి డెప్యూటీ మేయర్ ఉప ఎన్నికల్లో సోమవారం కూటమి ప్రభుత్వం రణరంగం సృష్టించింది. అధికారుల వత్తాసుతో దుశ్చర్యకు ఒడిగట్టింది. మెజారిటీ లేకున్నా తామే గెలవాలన్న లక్ష్యంతో ఒక్క సభ్యుడు ఉన్న టీడీపీ అరాచక రాజకీయాలకు పరాకాష్టగా మారింది. ఈ క్రమంలో సోమవారం యూనివర్సిటీ ప్రాంగణంలో సజావుగా జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది.

మండిపడుతున్న జర్నలిస్ట్ సంఘాలు

యూనివర్సిటీ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న సాక్షి ప్రతినిధి తిరుమల రవిరెడ్డి, ఫొటో జర్నలిస్ట్ గిరిప్రసాద్ రెడ్డిపై టీడీపీ, జనసేన నాయకులు విరుచుకుపడ్డారు. కెమెరా లాక్కుని పైశాచికంగా దాడి చేశారు. ఈ దాడిలో గిరిప్రసాద్‌రెడ్డి చేతికి తీవ్ర గాయమైంది. దీనిపై జర్నలిస్ట్ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పూర్తిస్థాయిలో స్పెషల్ బ్రాంచ్ వైఫల్యం

డెప్యూటీ మేయర్ ఎన్నికలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వైఫల్యం చెందారు. టీడీపీ, జనసేన గూండాలు రెచ్చిపోతున్నా తమకెందుకులే అన్నట్టు చూసీచూడనట్టు వదిలేశారు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, స్పెషల్ బ్యాంక్ డీఎస్పీ గిరిధర్ ఉన్నా ప్రయోజనం లేకపోయింది.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



చంద్రగిరి: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గత కొద్ది రోజులుగా స్వర్ణముఖి నదిలో నిరంతరం అక్రమ ఇసుక రవాణా సాగుతోంది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో సోమవారం తెల్లవారుజామున రెవెన్యూ, పోలీసు అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే ట్రాక్టర్లలో ఇసుకను నింపుతున్న జేసీబీని మాత్రం అధికారులు వదిలేశారు. ఈ మేరకు సీజ్ చేసిన ట్రాక్టర్లపై కేసులు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇవి కనిపించడం లేదా?

వారం రోజులుగా హిటాచీ, జేసీబీల సాయంతో టిప్పర్ల ద్వారా వందలాది వాహనాలు పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తుంటే అధికార యంత్రాంగానికి కనిపించడం లేదా..? అంటూ ట్రాక్టర్ల యజమానులు మండి పడుతున్నారు. రెడ్డివారిపల్లి, నాగయ్యగారిపల్లిలో యంత్రాల సాయంతో నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. అధికార అండతో అక్రమంగా రవాణా చేస్తున్న వారి జోలికి వెళ్లకుండా, ఇలా తమ లాంటి చిన్నవారిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు.

బీఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఈ నెల 5వ తేదీన బీ ఫార్మసీ కోర్సులో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఫార్మసీ విభాగాధిపతి ఎస్.జోష్నారాణి తెలిపారు. అర్హత కలిగిన బైపీసీ మహిళా అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వర్సిటీలో ఫార్మసీ విభాగానికి బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను గానీ, 9491537604 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూ బీ ఫార్మసీ కోర్స్‌కు స్పాట్ అడ్మిషన్లు

ఎస్వీయూలో బీఫార్మసీ కోర్సులో చేరదలచిన వారికి స్పాట్ అడ్మిషన్లు 5వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఈఏపీ సెట్–2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ఎంపీసీ, బైపీసీ చదివిన విద్యార్థులకు అవకాశం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిపికెట్లతో వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

తుమ్మలగుంటలో నేడు రథసప్తమి వేడుకలు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రథసప్తమి వేడుకలను అత్యంత రమణీయంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 6 నుంచి సప్త వాహనాలు (ఏడు వాహనాలు)పై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. ముందుగా స్వామి, అమ్మవార్లు సూర్యప్రభ వాహనంపై ఊరేగనున్నారు. ఆ తర్వాత వరుసగా చిన్న శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనాలపై ఊరేగనున్నారు. ఒక్క రోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి పర్వదినాన శ్రీనివాసుని దర్శనం చేసుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. తిరమల తరహాలో వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే రథసప్తమి ఉత్సవాలను తిలకించేందుకు తరలి వచ్చే భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు.


తుమ్మలగుంటలో రథసప్తమి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

పోలీస్ అదనపు బలగాల ఏర్పాటు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరపాలక డెప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశామని వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణ నేపథ్యంలో 250 మంది అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

డెప్యూటీ మేయర్ ఎన్నిక నేడు

తిరుపతి నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ ఎన్నిక సోమవారం నిర్వహించడానికి కోరం లేకపోవడంతోనే మంగళవారానికి వాయిదా వేశామని జేసీ, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. ప్రస్తుతం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో 47 మంది కార్పొరేటర్లు ఉన్నారని, అంతే కాకుండా ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారని చెప్పారు. మొత్తం 50 మందిలో కోరం ప్రకారం 25 మంది హాజరుకావాల్సి ఉందని వెల్లడించారు. అయితే సోమవారం 22 మంది హాజరుకావడంతో మంగళవారానికి వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు.

ఎస్వీయూ అష్ట దిగ్బంధం

తిరుపతి సిటీ: ఎస్వీయూను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో వేల సంఖ్యలో పోలీసులు వర్సిటీలో ఉదయం 6 నుంచే హల్‌చల్ చేశారు. వర్సిటీ పరిపాలనా భవనానికి వెళ్లే అన్ని దారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వర్సిటీకీ అధికారులు సోమవారం సెలవు ప్రకటించారు. వర్సిటీ ఆవరణలోని మెన్, ఉమెన్ హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కనీసం మెస్‌లకు వెళ్లేందుకు, వర్సిటీ నుంచి నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా అడ్డుకున్నారు. బయటకు వెళ్లిన విద్యార్థులను వర్సిటీలోనికి అనుమతించకపోవడంతో విద్యార్థులు రోడ్లపైనే పడిగాపులు కాశారు.

రైలు పట్టాలపై షికారు చేస్తూ..


మృతి చెందిన ఎలరాజు

తడ: రైలు పట్టాలపై షికారు చేస్తూ సమయానికి రైలు రావడంతో ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో నీళ్లల్లో దూకి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం కొండూరు పరిధిలో చోటుచేసుకుంది. సూళ్లూరుపేట రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా, నందికొట్కూరుకి చెందిన ఎలరాజు(20) మార్కాపురంలోని కళాశాలలో డిప్లొమో తృతీయ సంవత్సరం చదువుతూ ఇండస్ట్రియల్ ట్రెనింగ్ కోసం రెండు నెలల క్రితం శ్రీసిటీలోని పరిశ్రమలో చేరాడు. అక్కంపేటలోని హాస్టల్‌లో పేయింగ్ గెస్టుగా ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం మిత్రునితో కలిసి సూళ్లూరుపేటకు రైలు పట్టాల మీదుగా నడుచు కుంటూ బయలుదేరారు. కొండూరు పరిధిలోని పాముల కావల వద్దకు వచ్చే సరికి రైలు రావడం గమనించారు. ఆపై ఇద్దరూ చెరో వైపు పడిపోయారు. నీళ్లల్లో దూకిన ఎలరాజు తలకు బండరాయి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. మరో యువకుడు ఇసుకలో పడడంతో సురక్షితంగా తప్పించుకున్నాడు. రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ యువకుడిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఎలరాజు మృతిచెందాడు.

నడక దారిలో ఆకస్మిక తనిఖీలు

తిరుమల: అలిపిరి నడక మార్గంలోని మోకాలి మిట్ట వద్ద సోమవారం టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నడక మార్గంలోని మరుగుదొడ్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. అంబులెన్స్ సర్వీసును పరిశీలించారు. అనంతరం తిరుమలకు వస్తున్న భక్తులతో మాట్లాడి నడక దారిలో టీటీడీ ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అభిప్రాయాలు సేకరించారు.

ఎన్‌ఏఆర్‌ఎల్‌లో స్వచ్ఛతా పక్వాడ వారోత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎన్ఏఆర్ఎల్ అధికారులు

పాకాల: మండలంలోని గాదంకి ఎన్ఏఆర్ఎల్‌లో స్వచ్ఛతా పక్వాడ వారోత్సవాలను ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్‌కుమార్ పాత్ర అధ్యక్షతన ప్రారంభించారు. సోమవారం స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాల నిర్వహణ మానిటరింగ్ కమిటీని నియమించారు. అందులో శాస్త్రవేత్త పీ.రవిప్రసాద్, ఎం.శ్రీనివాస గుప్తా, బీ.మల్లికామాధురి, ఏఓ జీ.హరివెంకటకుమార్, కేవీ.శిజి ఉన్నారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బంది, అధికారులందరూ స్వచ్ఛతా పక్వాడ ప్రతిజ్ఞ చేశారు. వారోత్సవాల్లో ప్లాస్టిక్ రహిత సమాజం, క్యాంపస్ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, కరపత్రాలు పంచడం, స్వచ్ఛతపై బ్యానర్లతో ప్రదర్శన ఏర్పాటు చేయడం, జూట్ బ్యాగుల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

తిరుమలలో రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన


ఆలయ మాడ వీధుల్లో పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుమల: తిరుమలలో మంగళవారం రథసప్తమి నిర్వహించనున్న సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం తిరుమలలో భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఆలయ నాలుగు మాడ వీధులు, గ్యాలరీలు పార్కింగ్ ప్రదేశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. భద్రతాపరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తిరుమలలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. భక్తులు ఎక్కువగా ఏ సమయంలో వస్తారో... గుర్తించి ఆ సమయంలో ప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రామకృష్ణ, పలువురు డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం!


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వసంతి పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయంలోని మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద భక్తులు తమ చిన్నారులతో పాల్గొని వేదపండితులు ఆశీర్వచనాల నడుమ అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు మాట్లాడుతూ వసంత పంచమి రోజున చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిచడం ఎంతో శుభకరమన్నారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇక పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్, శ్రీచైతన్య, ఎంజీఎం తదితర పాఠశాలల్లో కూడా నర్సరీ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు

రథసప్తమికి పెంచలకోన సిద్ధం


పెంచలకోనలో వాహనాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

రాపూరు: మండలంలోని పెంచలకోనలో మంగళవారం జరగనున్న రథసప్తమి వేడుకులకు సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. రథసప్తమి నాడు సప్త వాహనాల్లో శ్రీపెనుశిల లక్ష్మీనసింహుడు క్షేత్రంలోని మాడ వీధుల్లో ఊరేగనున్నారు. రథసప్తమి పర్వదినాన్ని మినీ బ్రహ్మోత్సవంలా భవిస్తారని అధికారులు వెల్లడించారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టినట్టు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు సూర్యప్రభ వాహనంపై, 8కి శేష వాహనం, 10కి సింహ వాహనం, 12కు బంగారు హనుమంత వాహనం, 2 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 4 గంటలకు హనుమంత వాహనం, 6కు అశ్వ వాహనం, 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారు ఊరేగనున్నట్టు తెలిపారు.

అర్జీలకు పరిష్కారం చూపండి


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 220 అర్జీలు వచ్చాయి. అందులో 116 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయం నుంచి మండల కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాల పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.